

# కొత్తగాలి

"మీరు తల్లి కాబోతున్నారు" గర్భనిర్ధారణ చేసింది శ్రుతి. మెల్లగా ఎగ్జామినేషన్ టేబిల్ దిగివచ్చి శ్రుతికి ఎదురుగా కూర్చుంది అమరేశ్వరి. శ్రుతి ఊహించినట్లు ఆమె ముఖం సంతోషంతో విప్పారలేదు. అంత మంచివార్తను విన్న ఉద్వేగంతో 'థాంక్ యూ' అనలేదు.

శ్రుతికి తెలిసినంత వరకు అమరేశ్వరి కొంచెం లేట్‌గానే వివాహం చేసుకుంది. ఇన్నాళ్ళకు వివాహమయి తల్లి కాబోతుంటే సంతోషంతో ఉక్కిరి బిక్కిరయే ఆడవాళ్ళనే చూసింది కాని యింత నిర్లిప్తంగా కూర్చునే వ్యక్తిని చూడడం ఇదే ప్రథమం. "ఆర్ యు నాట్ హేపీ? తల్లి కాబోతున్నానన్న భావన మీకు సంతోషాన్ని కలిగించడం లేదా?" ఉత్సుకంగా చూసింది శ్రుతి.

"పెళ్ళి చేసుకుని కాపురం చేస్తున్న దాన్ని , తల్లి కావడంలో పెద్ద విశేషమేముంది?" శ్రుతి వంక వింతగా చూసింది అమర. ఆమె ప్రశ్నకు తొట్రుపడి గుక్క తిప్పుకోవడానికో నిమిషం పట్టింది శ్రుతికి.

"వెల్" సర్దుకుంటూ చిన్నగా నవ్వి, ఆమె వివరాల్ని ఏంటినేటల్ కార్డ్ మీద వ్రాయసాగింది శ్రుతి.

"డాక్టర్!" అమర పిలుపు విని తలెత్తింది శ్రుతి.

"బ్లడ్‌టెస్ట్ చెయ్యాల్సిన అవసరం లేదా?"

"చెయ్యాలి. బ్లడ్ తీసుకుంటామిప్పుడు" అవసరమైన పరీక్షల్ని అడిగి చేయించు కోవాలనే ఆలోచన కొంతమంది మహిళలకైనా వస్తున్నందుకు సంతోషపడింది శ్రుతి.

"ఎందు కడుగుతున్నానంటే... మా వారికి పెళ్ళికి ముందు కొన్ని అలవాట్లుండేవి. సుఖవ్యాధులు వున్నాయేమోనని నా అనుమానం. నాకాయన అలవాట్ల గురించి తెలిసి బ్లడ్‌టెస్ట్ చేయించుకునే లోగానే పీరియడ్ మిస్ అయాను. అలాంటి వ్యాధులేవైనా ఆయనకు వుండివుంటే నాకు, నానుంచి నా కడుపులో పెరుగుతున్న బిడ్డకు అంటే ప్రమాదముంది కదా?" సూటిగా, ఎలాంటి సంకోచాలూ, నదురూ, బెదురూ లేకుండా తన సమస్యను శ్రుతికి చెప్పింది అమర. అమర ధోరణి కొత్తగా ఉంది శ్రుతికి. భయం భయంగా, గిల్టీగా, సగం దాచి సగం చెప్పే ఆడవారినీ, అలాంటి తిరుగుబోతు భర్త లభించినందుకు క్రోధంతో మండిపడుతూ అతన్నీ, విధినీ తూర్పారపట్టే వారినీ చూసింది కాని, పరిస్థితిని యింత నిబ్బరంగా స్వీకరించే మహిళ తారసపడడం యిదే మొదటిసారి.

"మీరు చెప్పేది రైటే. ఇప్పుడు నేను చేయించబోయే పరీక్షలలో దానికి సంబంధించినది కూడా ఉంటుంది" ఏంటినేటల్ కార్డ్ వ్రాయడం పూర్తిచేసి బ్లడ్ తీసుకుంది శ్రుతి. 'వాళ్ళంతట వాళ్ళు అడిగి చేయించుకోకపోతే మానె, కనీసం డాక్టర్లు చెప్పినప్పుడైనా నిర్లక్ష్యం చేయకుండా వుంటే ఎన్నో గర్భస్రావాల్ని, మృత శిశు జననాల్ని నివారింపవచ్చు. శారీరక, మానసిక వికలాంగులు పుట్టకుండా జాగ్రత్త పడవచ్చు' తన ధోరణిలో తను ఆలోచిస్తూంది శ్రుతి.

"ఒక అరగంట కూర్చోగలరా? రిపోర్ట్ చూసి మందులు వ్రాసిస్తాను" కేస్‌షీట్ అమర ముందుకు జరుపుతూ అడిగింది శ్రుతి.

"కూర్చుంటాను" లేచి బయటకు వెళ్ళబోయింది అమర.

" ఒక్కనిమిషం కూర్చోండి... మీరేమీ అనుకోనంటే చిన్న ప్రశ్న."

"అడగండి" చిరునవ్వు విరిసిందామె అధరాలమీద. ఒక నిమిషం తటపటాయిస్తూ ఉండిపోయింది శ్రుతి.

"మీ భర్త అలవాట్లు... ఈ విషయాన్ని మీరింత తేలిగ్గా ఎలా తీసుకోగలుగు తున్నారు? మీకేమీ బాధలేదా?" ఈమె హృదయం సంతోషానికీ, బాధకూ అతీతంగా మారిపోయిందా?! అంచేతే ఏ అనుభూతుల ఒత్తిడికి లొంగకుండా నిర్వికారంగా చెప్పగలుగుతూందా?- ఆమె ఏం జవాబిస్తుందోనని కుతూహలంగా ఎదురుచూస్తుంది శ్రుతి.

"ఇందులో బాధపడడానికేముంది?... ఇప్పుడు మావారి వయసెంతో తెలుసా? ముప్పైఎనిమిది. ఆయన కుటుంబ బాధ్యతలు ఆయన్ని, నా పరిస్థితులు నన్ను పెళ్ళి చేసుకోకుండా ఆపాయి. బాధ్యతలు వేరు. శారీరకమైన ఉద్రేకాల్ని నిగ్రహించుకోవడం వేరు. ఇన్నేళ్ళొచ్చిన మగవాడు అస్ఖలిత బ్రహ్మచారిగా వుంటాడని ఆశించడం, ఒకవేళ అలా వుండకపోతే నాకేదో అన్యాయం జరిగిపోయిందని రాద్ధాంతం చెయ్యడం వెర్రితనం కాదా?" రిచ్చవోయి వింటూందామె మాటల్ని శ్రుతి... ఐతే, అలాంటి అలవాట్లు తప్పులేనివని ఈమె అభిప్రాయమా? లేక తప్పనిసరై సర్దుకుపోతూ సమర్థిస్తూందా? మనసులో ఎలాంటి నియమాలు, సిద్ధాంతాల పట్ల ఆకర్షణ, నమ్మకం వున్నా నూటికి నూరుపాళ్ళు శీలం, పవిత్రతలమీద గొప్ప అభిప్రాయాల్ని వెలిబుచ్చుతూ మాట్లాడే వనితల్నే చూడడంవల్ల అమర నిర్భయత్వం ఆకర్షణీయంగా కనపడింది శ్రుతికి.

"కాని..." ఒక క్షణం ఆగి తేరుకుని ప్రశ్నించబోయింది శ్రుతి.

"మీరడగబోయే దేమిటో నాకు తెలుసు. నాకిలాంటి వ్యవహారాలుంటే నా భర్త యింత తేలిగ్గా తీసుకుంటాడా, యింత సహజంగా తీసుకుని నాతో సరిగ్గా కాపురం చేస్తాడా అని కదూ? యిద్దరికీ సమానమైన న్యాయం ఉండాల్సిన పరిస్థితిలో అతనికంటే చదువులోను, సంపాదనలోనూ ఏ విధంగానూ తీసిపోని నేను యింత లొంగుబాటుగా ప్రవర్తించడం నా వ్యక్తిత్వానికి మచ్చకదా అని కదూ మీరు ప్రశ్నించేది?" ఆశ్చర్యంగా తన మనసులోని ప్రశ్నల్ని అమర నోటి వెంట వింటూంది శ్రుతి. కాని యింకా కొన్ని ప్రశ్నలుండిపోయాయి శ్రుతి

మనసులో. ఒకదాని కొకటి సంబంధంలేని ప్రశ్నలన్నీ కలిసి ఒక చిక్కుముడి తయారయింది.

"నేను ఉద్రేకాలు లేని మనిషిని కాదు. కాని ఏవేవో ఇన్హిబిషన్స్, ఈ సమాజం ఆడదానికి పెట్టిన అనేకమైన ఆంక్షలు, వ్యక్తిగా నాకున్న నమ్మకాలు నా ఉద్రేకాల్ని చంపేశాయి. కేవలం ఈ దేశంలో ఆడపిల్లగా, అదీ మధ్యతరగతి ఆడపిల్లగా పుట్టి పెరగడంవల్లే నేనిలా ఉండగలిగాను. మగవాడిగా పుడితే అతనిలానే ప్రవర్తించడానికే ఎక్కువ అవకాశముందనిపిస్తుంది నాకు. అంటే - తప్పేదైనా వుంటే అది అన్ని అవకాశాలూ, అధికారాలూ మగవాడికి కట్టబెట్టిన సంప్రదాయానిది కాని, వ్యక్తిగా నా భర్త తప్పేంలేదనే నిర్ణయానికొచ్చాను." ఏ మాత్రం ఆవేశం లేకుండా చెప్పసాగింది అమర. ఆమె సిద్ధాంతాలు పూర్తిగా మింగుడు పడడంలేదు శ్రుతికి.

"ఐతే యిదంతా మీకు సహజంగా కనిపిస్తూందా?"ఆమెతో చర్చ ఆసక్తికరంగా వుంది శ్రుతికి. తరువాత చూడాల్సిన పేషెంట్స్ ఎవరూ లేకపోవడంవల్ల తీరిగ్గా కూడా వుంది.

"నాకెలా కనిపిస్తూందన్నది కాదుసమస్య. యిప్పుడున్న పరిస్థితి యిది. యీ పరిస్థితిలో ఆత్మగౌరవాన్ని కోల్పోకుండా బ్రతుకులోని తీపిని ఎంత ఎక్కువ అనుభవించగలం అని ఆలోచిస్తున్నాను... జీవితం చాలా చిన్నది. అందులో దాదాపు సగభాగం గడిచిపోయింది. గడిచిపోయిన వాటి గురించి, ఎంత ప్రయత్నించీ తిరిగి సరిచేయలేని వాటి గురించి తలబ్రద్దలు కొట్టుకుంటూ తన జీవితంతోపాటు ఎదుటివాడి జీవితాన్ని కూడా నరకం చెయ్యడం మంచిది కాదనిపించింది... దంపతులకు కావలసింది వేర్వేరుగా గడిచిపోయిన గతంకాదు, ఒకటిగా నడుస్తున్న వర్తమానం, ఒకటిగా నడవవలసిన భవిష్యత్తు... గతంతో రాజీ పడకపోవడం తెలివి తక్కువ, వర్తమానంతో రాజీపడిపోయిబ్రతకడం అసమర్ధత" శ్రుతి మనసులోని చిక్కుముడి మరింత జటిలం కాసాగింది. విలువలు, తప్పొప్పుల ప్రమాణాలు మారిపోతున్నాయి. అవి కొద్దో, గొప్పో ఆడ, మగ యిద్దరికీ వర్తిస్తున్నాయి. ఈ పరిస్థితిలో కొంత రాజీ, కొంత తిరుగుబాటు, కొంత కన్ఫ్యూషన్ తప్పవేమో! అమర వంక చూస్తున్న శ్రుతిలో ఆలోచనల వలయాలు లేస్తున్నాయి.